శాస్త్రీయ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసిన డీఈవో రాజు

కామారెడ్డి, డిసెంబర్ 20 : జిల్లా కేంద్రంలోని సాందీపని డిగ్రీ కళాశాలలో బయోసైన్స్ ఫోరం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు జీవశాస్త్ర ప్రతిభ పరీక్షా పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఈవో రాజు హాజరై మాట్లాడారు. విద్యార్థులకు సైన్స్‌పై అవగాహన ఉండాలన్నారు. శాస్త్రీయ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు ఎల్లప్పుడు కొత్త విషయాలను తెలియజేయాలన్నారు. అనంతరం రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు కిరణ్, వర్ష, మానస, సంమీతను వంగ మహేందర్‌రెడ్డి ఫౌండేషన్ తరఫున బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ వక్త మోటివేషనల్ స్పీకర్ హరిస్మరణ్‌రెడ్డి, డీఎస్‌వో సిద్దిరాంరెడ్డి, బయోసైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి సురేశ్, సంతోష్ యాదాగౌడ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలి

హెల్మెట్ ధరించిన వారికి పువ్వును అందజేస్తున్న విద్యార్థిని

కామారెడ్డి, డిసెంబర్ 20 : జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో నిజాంసాగర్ చౌరస్తా వద్ద హెల్మెట్ వాడకంపై ప్రభుత్వం పాఠశాల విద్యార్థినుల సహకారంతో వాహనదారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రయాణం చేయాలని సూచించారు. అనంతరం హెల్మెట్ ధరించిన వారికి గులాబీ పువ్వులు అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై మహేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్వోసీ అందజేత

మాచారెడ్డి, డిసెంబర్ 20 : పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట గ్రామానికి చెందిన రాజవ్వ అనారోగ్యంతో బాధపడుతున్నది. ఈ విషయాన్ని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లగా వెంటనే రూ.రెండు లక్షల యాభైవేల ఎల్వోసీని బాధిత కుటుంబానికి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పాల్వంచ మండలాధ్యక్షుడు పల్లె రమేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆగని నిరసనలు

- అమిత్‌షా వ్యాఖ్యలపై దళితుల ఆగ్రహం
- రెండో రోజూ కొనసాగిన ఆందోళనలు
- అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం
- కేంద్రమంత్రి దిష్టిబొమ్మల దహనం

బీబీపేటలో ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులను సముదాయిస్తున్న పోలీసులు

బాన్సువాడలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

లింగంపేట(తాడ్వాయి)/బీబీపేట్/బాన్సువాడ టౌన్/బిచ్కుంద, డిసెంబర్ 20: కేంద్ర మంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై దళితులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. జిల్లాలో రెండో రోజూ శుక్రవారం సైతం ఆందోళన కార్యక్రమాలు కొనసాగాయి. దళిత, అంబేద్కర్ సంఘాల ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. కేంద్ర మంత్రి దిష్టిబొమ్మలను దహనం చేశారు.

తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి అంబేద్కర్ సంఘం ఆధ్యర్యంలో క్షీరాభిషేకం చేశారు. అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రాజలింగం, చిట్యాల సాయన్న, రాజు, గంగారాం, బాలయ్య, రమేశ్, రాము, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బీబీపేటలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో ప్రధాన రోడ్డుపై ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై ప్రభాకర్ ఘటనా స్థలానికి చేరుకొని దళిత సంఘాల నాయకులను సముదాయించారు. కార్యక్రమంలో దళిత సంఘం నాయకుడు తలారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

బాన్సువాడలో దళిత సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు దొన్కంటి విఠల్, సాయిలు, గోపాల్, మల్లూరి సాయిలు, గంగాధర్, రవీందర్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్‌లో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం నాయకుడు గజానంద్, రాజు, లక్ష్మణ్, బాలాజి, దేవీదాస్, అజయ్, ఇమ్రాన్, ఫిర్దోస్ తదితరులు పాల్గొన్నారు.

బీబీపేటలో దళిత బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో రోడ్డుపై ధర్నా చేస్తున్న దళిత సంఘాల నాయకులు

తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అంబేద్కర్ సంఘం నాయకులు

సర్వేను వేగవంతం చేయాలి

సర్వేను పరిశీలిస్తున్న డీఈవో రాజు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 20 : మండలంలోని బోర్లం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను మండల ప్రత్యేకాధికారి, జిల్లా విద్యాధికారి రాజు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికుమార్ చేస్తున్న సర్వే తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు, జూనియర్ అసిస్టెంట్ అశోక్ తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో నాగేశ్వర్‌రావు

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 20 : విద్యార్థులకు ప్రభుత్వ మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలని బాన్సువాడ మండల విద్యాధికారి నాగేశ్వర్‌రావు భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని చిన్న రాంపూర్ ప్రాథమిక పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వండిపెట్టిన మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, వంటగది, వంట పాత్రలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయులు నక్క ప్రవీణ్, రమణ ఉన్నారు.

ఒకే ఈతలో రెండు దూడల జననం

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 20 : బాన్సువాడ మండలంలోని దేశాయిపేట్ గ్రామంలో గాండ్ల సాయిలు అనే రైతుకు చెందిన ఆవు రెండు దూడలకు శుక్రవారం జన్మనిచ్చింది. గోపాల మిత్రలు రాములు, వెంకటి ఆవుకు ప్రసవం చేశారు. ఆవు రెండు దూడలకు జన్మనిచ్చిన విషయాన్ని తెలుసుకున్న గ్రామస్తులు దూడలను చూసేందుకు తరలి వచ్చారు. రైతు సంతోషం వ్యక్తం చేశాడు.

వైన్స్‌లో చోరీ

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 20: పిట్లం మండలంలోని మద్దెలచెరువు గ్రామంలో ఉన్న మహాదేవి వైన్స్‌లో గురువారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు వైన్స్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. కౌంటర్‌లోని రూ.రెండు వేలు, రెండు బ్లెండర్స్ ప్రైడ్ ఫుల్ బాటిళ్లు, సీసీ టీవీ డీవీఆర్‌ను చోరీ చేశారు. వైన్స్ సేల్స్ మేనేజర్ గొడుగు నాగనాథ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

లైంగిక దాడికి యత్నించిన వ్యక్తి రిమాండ్

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 20: లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బేగంపూర్ గ్రామానికి చెందిన పెండ్యాల విజయ్‌కుమార్ ఈనెల 15వ తేదీన అదే గ్రామానికి చెందిన ఓ మహిళపై లైంగిక దాడికి యత్నించాడు. ఆమె కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వెంటపడగా.. అక్కడి నుంచి పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న విజయ్‌కుమార్‌ను బేగంపూర్ శివారులో శుక్రవారం అదుపులోకి తీసుకొని, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

పోలీసులు పట్టుకున్న వాహనం

గాంధారి, డిసెంబర్ 20: అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బాన్సువాడకు చెందిన రహీం గాంధారి మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం పీడీఎస్ బియ్యం కొనుగోలు చేశాడు. మొత్తం 11క్వింటాళ్ల 30 కిలోల రేషన్ బియ్యాన్ని బొలెరో వాహనంలో బాన్సువాడకు తరలిస్తున్నాడు. పొతంగల్ కలాన్ వద్ద వాహనాన్ని తనిఖీ చేయగా.. బియ్యం పట్టుబడడంతో సీజ్ చేసి వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి సంబంధిత అధికారులకు సమాచారం అందించామని పేర్కొన్నారు.

వసతి గృహ పరిసరాలు శుభ్రంగా ఉంచాలి

జడ్పీ సీఈవో చందర్‌నాయక్

లింగంపేట బీసీ బాలుర వసతి గృహ పరిసరాలు పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో చందర్‌నాయక్, ప్యూరిఫైర్‌ను పరిశీలిస్తున్న అధికారి

లింగంపేట, డిసెంబర్ 20: వసతి గృహ పరిసరాలు శుభ్రంగా ఉంచాలని జడ్పీ సీఈవో చందర్‌నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. హాస్టల్ పరిసరాలు, మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటే దోమలు వృద్ధి చెంది విద్యార్థులు రోగాల బారినపడుతారని అన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కామన్‌డైట్ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు. సీఈవో వెంట ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్లారీ, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, వార్డెన్ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

వాటర్ ప్యూరిఫైర్లకు త్వరలో మరమ్మతు..

జిల్లాలోని ఆయా మండలాల్లోని బీసీ బాలుర వసతి గృహాల్లో ఉన్న వాటర్ ప్యూరిఫైర్లకు త్వరలో మరమ్మతు చేయించనున్నట్లు సీఈవో చందర్‌నాయక్ వెల్లడించారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో సోమవారం ప్రచురితమైన వసతి గృహాల్లో పని చేయని ప్యూరిఫైర్ల కథనానికి ఆయన స్పందించారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శించిన ఆయన నమస్తే తెలంగాణతో మాట్లాడారు. జిల్లాలోని 18 వసతి గృహాల్లో ప్యూరిఫైర్లు పని చేయడం లేదన్నారు. వాటి మరమ్మతు విషయమై కలెక్టర్‌తో చర్చించినట్లు తెలిపారు. జిల్లాలోని ఆయా మండలాల్లో ఉన్న ప్యూరిఫైర్ల మరమ్మతు కోసం కొటేషన్లు పంపాలని సూచించినట్లు తెలిపారు.

కాలభైరవుడిని దర్శించుకున్న జిల్లా జడ్జి

జడ్జి దంపతులను సన్మానిస్తున్న జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్

రామారెడ్డి, డిసెంబర్ 20: రామారెడ్డి మండల కేంద్రంలోని కాలభైరవ స్వామిని జిల్లా జడ్జి సుమలత దంపతులు శుక్రవారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ ఆలయ చరిత్రను వారికి వివరించారు. అనంతరం శాలువా కప్పి, స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించారు. కార్యక్రమంలో పూజారులు శ్రీనివాస్ శర్మ, వంశీశర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మంచి భోజనం అందించాలి

విద్యార్థినులతో మాట్లాడుతున్న తహసీల్దార్ మహేందర్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 20: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాన్ని అందించాలని తహసీల్దార్ అల్లం మహేందర్ అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ స్కూల్ వసతిగృహాన్ని ఆయన శుక్రవారం సందర్శించి, రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజనం వివరాలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు వసతిగృహం సిబ్బంది, విద్యార్థులు ఉన్నారు.

సంత్‌గాడ్గే బాబాకు నివాళి

నివాళులర్పిస్తున్న రజకులు

బిచ్కుంద, డిసెంబర్ 20: సంత్‌గాడ్గే బాబా వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో బిచ్కుందలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గాడ్గే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రజకుల కోసం ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు విఠల్, రాజు, రమేశ్, హన్మాండ్లు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మాట్లాడుతున్న ఎస్సై మహేశ్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 20: సైబర్ నేరాగాళ్లు రోజుకో కొత్త రకం మోసానికి పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ ప్రజలకు సూచించారు. ఆయన శుక్రవారం ఎల్లారెడ్డిలో మాట్లాడారు. 'జంప్డ్' అనే కొత్త పద్ధతిలో మొబైల్ వినియోగదారులను మోసం చేస్తున్నారని తెలిపారు. స్కామర్లు తమ మొబైల్ నుంచి మీకు ఫోన్‌పే, జీపే, పేటీఎం తదితర యాప్‌ల ద్వారా కొన్ని డబ్బులు పంపుతారన్నారు. డబ్బు వచ్చినప్పుడు మీరు బ్యాలెన్స్ చెక్ చేసుకోవడానికి సీక్రెట్ పిన్ నంబర్‌ను నమోదు చేయగానే.. సైబర్ నేరగాళ్లు మీ ఫోన్‌ను హ్యాక్ చేస్తారని చెప్పారు. వెంటనే మీ ఖాతాలోని డబ్బును వారు మాయం చేస్తారన్నారు. ప్రజల బ్యాంకు ఖాతాలోని డబ్బు ఖాళీ చేయడానికి ఇది కొత్త తరహా పద్ధతి అని, అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

కొనసాగుతున్న పీజీ పరీక్షలు

- తనిఖీ చేసిన వీసీ యాదగిరిరావు

డిచ్‌పల్లి, డిసెంబర్ 20 : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ 1, 3వ సెమిస్టర్ రెగ్యులర్ (థియరీ, ప్రాక్టికల్), ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సు మొదటి సెమిస్టర్, ఎల్ఎల్‌బీ, ఐఎంబీఏ 7, 9వ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. తెలంగాణ యూనివర్సిటీ అర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్న పరీక్షలను టీయూ వైస్ చాన్సలర్ యాదగిరిరావు శుక్రవారం తనిఖీ చేశారు. 151 మంది విద్యార్థులకు 148 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ గంటా చంద్రశేఖర్ తెలిపారు. ఆయన వెంట అడిషనల్ కంట్రోలర్ సాయిలు, వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

రామారెడ్డి, డిసెంబర్ 20: సదాశివనగర్ మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతిచెందాడు. సదాశివనగర్ ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివనగర్‌కు చెందిన కుప్రియాల చిన్న రాజయ్య(68) తన టీవీఎస్ ఎక్సెల్‌పై కామారెడ్డి వైపునకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అనారోగ్యంతో విద్యార్థిని..

అలీన(ఫైల్)

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 20: మున్సిపల్ పరిధిలోని గండి మాసానిపేట్ గ్రామానికి చెందిన అలీన అనారోగ్యంతో మృతి చెందింది. అలీన కామారెడ్డిలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్నది. ఇటీవల ఆమెకు పసిరికలు(జాండీస్) సోకడంతో హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందిందని తండ్రి రఫీక్ తెలిపారు. ఆమె ఇటీవల కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ చేతుల మీదుగా ఉత్తమ విద్యార్థిని అవార్డును అందుకున్నది. విద్యార్థిని మృతితో గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి.

రాష్ట్రస్థాయి బయోసైన్స్ పోటీలకు ఎంపిక

వర్షకు ప్రశంసాపత్రం అందజేస్తున్న డీఈవో రాజు

రామారెడ్డి, డిసెంబర్ 20: కామారెడ్డిలో శుక్రవారం నిర్వహించిన బయోసైన్స్ టాలెంట్ పోటీల్లో రామారెడ్డి మండలంలోని రెడ్డిపేట జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని యు.వర్ష ప్రతిభ చాటింది. జిల్లా స్థాయిలో రెండో స్థానంలో నిలిచింది. డీఈవో రాజు ఆమెకు ప్రశంసాపత్రంతోపాటు జ్ఞాపికను అందజేశారు. దీంతో ఆమెను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారని హెడ్‌మాస్టర్ గోపాల్‌రెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

రామారెడ్డి, డిసెంబర్ 20: మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ఎనగర్తి నర్సింహులు అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి నారెడ్డి స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు నారెడ్డి మోహన్‌రెడ్డి రూ.రెండు వేల నగదు, 50 కిలోల బియ్యాన్ని శుక్రవారం అందజేశారు. నాయకుడు రఘోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.